పెన్ పవర్
10 YEAR ANNIVERSARY 2014 - 2024
తెలంగాణ రౌండప్
మంగళవారం 26 నవంబర్ 2024 పేజీలు 8



ఎఫెక్ట్

# బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో...
# అక్రమ షెడ్లు కూల్చివేత



బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో అక్రమ షెడ్డు కూల్చివేత..

- మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలతో తహశీల్దార్ చర్యలు..
- నోటీసులిచ్చిన అక్రమ షెడ్డు.. బౌరంపేట్ రోడ్డులో మూడు కంటైనర్‌లు ధ్వంసం..
- బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ స్థలంలో అక్రమ షెడ్ల నిర్మాణం..
- "పెన్ పవర్" దినపత్రికలో 227 కబ్జాలపై వరుస కథనాలకు స్పందించిన జాయింట్ కలెక్టర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 25:** హైకోర్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ షెడ్లు, మూడు కంటైనర్‌లను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమి మొత్తం 353.35 ఎకరాలు.. ప్రభుత్వ భూమిలోని గాయత్రినగర్‌లో 400 గజాల్లో నిర్మించిన అక్రమ షెడ్డుకు గత మే 7న దుండిగల్ తహశీల్దార్ నోటీసులు జారీచేశారు.. నోటీసులు ఇచ్చిన రెవెన్యూ అధికారులు, చర్యలకు కాలయాపనపై "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథనాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళగా..!మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పందించారు.. దుండిగల్ మండల తహశీల్దార్‌ను చర్యలకు ఆదేశించడంతో, బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలోని అక్రమ షెడ్డును సోమవారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు.. బౌరంపేట్ రోడ్డులో ప్రభుత్వ భూమిలోని సాయినాథ్ సొసైటీలో సుమారు 900 గజాల ప్రభుత్వ భూమిని కంటైనర్‌లతో ఆక్రమించి కబ్జాచేశారు.. 3 కంటైనర్‌లు కూల్చివేసిన రెవెన్యూ అధికారులు మరో రెండు కంటైనర్‌లు,తామే తొలగించుకుంటామని ఆక్రమణ దారులు చెప్పడంతో వదిలేసినట్టు తెలుస్తోంది..

-2లో



బౌరంపేట్ రోడ్డులో 227 ప్రభుత్వ భూమి ఆక్రమణతో అక్రమంగా కంటైనర్ కూల్చివేత.. కూల్చివేయని కంటైనర్ వృత్తంలో..

---

## సర్వే నెం.227 సర్కారీ జమీన్‌పై.. ప్రజావాణిలో ఫిర్యాదు..

- బహుదూర్‌పల్లి సేత్వార్ పహాణీ ప్రకారం సర్వే నెం.227 మొత్తం విస్తీర్ణం 353.35 ఎకరాలు..
- 1951-52 బహదురుపల్లి పహాణీ ప్రకారంగా కూడా భూ స్వభావం పోరంబోకు..
- హైకోర్టు డైరెక్షన్‌తో 2009లోనూ సర్కారు స్థలంగా జాయింట్ కలెక్టర్ జగన్మోహన్ ఐఏఎస్ నివేదిక..
- తాజాగా రెవెన్యూ నోటీసుల్లోనూ 227 పోరంబోకు 353.35 ఎకరాలుగా పేర్కొన్న ఎమ్మార్వో..
- వేలకోట్లు విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలకు ఆకుల సతీష్ డిమాండ్..
- హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ధరణీ రిజిస్ట్రేషన్‌లపై చర్యలకు ఫిర్యాదు..

### రూ.2 వేలకోట్లు విలువైన..353.35 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించండి..

### మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..

-3 లో



## మిడ్'డే'మీల్స్ ప్యాకింగ్ కేంద్రాన్ని.. కలెక్టర్ తనిఖీ..

- మూడు జిల్లాల పాఠశాల విద్యార్థులకి మధ్యాహ్న భోజనం అందించే కేంద్రం..
- ఉప్పల్‌లోని మన్నా ట్రస్ట్ ద్వారా డైలీ 80 వేల మంది విద్యార్థులకు మీల్స్ ప్యాకింగ్ అందజేత..
- రుచికరమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని కలెక్టర్ సూచించారు..
- నాణ్యమైన వంట సామాగ్రిని వాడాలని, డేట్ చెక్ చేయాలని కలెక్టర్ సూచించారు..
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు..

-4 లో

# బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో.. అక్రమ షెడ్లు కూల్చివేత..




కూల్చివేసిన కమ్మ సేవాసమితి కళ్యాణ మండపం కమాన్..




మళ్ళీ నిర్మించిన కమ్మ సేవాసమితి కళ్యాణ మండపం కమాన్..

**సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమి గత ఇరవై ఏళ్ళుగా హైకోర్టు పరిధిలోనే ఉన్నప్పటికీ..! అక్రమార్కులు హైకోర్టును ధిక్కరించి నిర్మాణాలు చేపడుతుండగా..! అధికారులు సహకరించే ధోరణితోనే ఉన్నట్టు పంచాయతీరాజ్ ఎస్‌డిఎఫ్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తిచేసి పంతం నెగ్గించుకున్నారు.. మరోవైపు భవిష్యత్తు కబ్జాలకు ఈ సీసీరోడ్డు కీలకం కాబోతుందనే ఆరోపణలు లేకపోలేదు.. నియోజకవర్గం అభివృద్ధి నిధులు రూ.60 లక్షలు దుర్వినియోగం చేస్తున్నారని, ప్రభుత్వ భూమి కబ్జాలకు ముందస్తుగా ఈ రోడ్లు అధికారికంగా నిర్మించడంపై పలువురు విమర్శలు చేశారు.. అసలు సీసీరోడ్డు నిర్మాణం కమ్మ సేవాసమితి కళ్యాణ మండపానికి అన్నట్టు నిరూపించారు.. వెంటనే "కమాన్ నిర్మించారు.. రెవెన్యూ కూల్చి వేసినప్పటికీ మళ్ళీ నిర్మించడం దుండిగల్ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం..**



227 ప్రభుత్వ భూమిలో రూ.60 లక్షల నిధులతో సీసీరోడ్డు.. ఇదే..

## అక్రమ సీసీరోడ్డుపై చర్యలేవి..?

జిల్లా ఉన్నతాధికారులు చర్యలకు ఆదేశించినా..! స్థానిక రెవెన్యూ అధికారులు అసంపూర్తి చర్యలు పలు అనుమానాలకు తావిస్తోంది.. "ఎస్‌డిఎఫ్" నిధులు మంజూరులో, సంబంధిత అధికారుల చేతివాటం స్పష్టంగా కనిపిస్తుంది.. బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమి 353.35 ఎకరాల్లో గాయత్రి నగర్‌లోని ఓ ఇంటి నెంబర్ మాత్రమే చూపించి, 227 ప్రభుత్వ భూమిగా పేర్కొనకుండా, పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేయించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం "స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్" రూ.10.5 కోట్లలో 227 ప్రభుత్వ భూమిలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షలు 2023 ఏప్రిల్ నెలలో అప్పటి కలెక్టర్ అమోయ్ కుమార్ ముంజూరు చేశారు.. ప్రభుత్వ భూమిలో పంచాయతీరాజ్ నిధుల సీసీరోడ్డు నిర్మాణం అంటూ, పెన్ పవర్ దినపత్రికలో వార్తా కథనంతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు తీసుకోకపోగా, సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేయడం గమనార్హం.. పైగా వార్తలు రాస్తున్న విలేఖరిపై తహశీల్దార్ తప్పుడు కేసు పెట్టడాన్ని కూడా కలెక్టర్ సమర్ధించడం గమనార్హం.. అక్రమ సీసీరోడ్డు నిర్మాణం యధేచ్చగా పూర్తి చేయడం అంతా పథకం ప్రకారమే, కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబంధిత సీసీరోడ్డు మంజూరుపై విచారణ జరిపించాలని, 227 భవిష్యత్తు కబ్జాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు..

## కూల్చివేసిన కమాన్ మళ్ళీ నిర్మించారు.. భవిష్యత్తు కబ్జాకు పునాది..

సర్వే నెంబర్ 227 సర్కారు స్థలంలో సీసీరోడ్డు నిర్మాణం సంవత్సరం పాటు పనులు నిలిపివేసి ఆతర్వాత అధికారుల అండతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు..227లోని "కమ్మ సేవాసమితి కళ్యాణ మండపానికి కబ్జాదారులకు సహకరించే విధంగా సీసీరోడ్డు పూర్తిచేశారు.. రోడ్డుకే నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, నూతన సీసీరోడ్డుపై "కమ్మ సేవాసమితి కమాన్"మరిన్ని విమర్శలకు దారితీస్తుంది.. పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన వార్తా కథనాలతో, సంబంధిత కమాన్ కూల్చివేసిన రెవెన్యూ అధికారులు..! కబ్జాదారులు మళ్ళీ నిర్మించారని, అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా.. అక్రమ షెడ్లను కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది.. కమాన్‌పై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి..

- బహుదూర్‌పల్లి సేత్వార్ పహానీ ప్రకారం సర్వే నెం.227 మొత్తం విస్తీర్ణం 353.35 ఎకరాలు..
- 1951-52 బహదురుపల్లి పహాణీ ప్రకారంగా కూడా భూ స్వభావం పోరంబోకు..
- హైకోర్టు డైరెక్షన్‌తో 2009లోనూ సర్కారు స్థలంగా జాయింట్ కలెక్టర్ జగన్మోహన్ ఐఏఎస్ నివేదిక..
- తాజాగా రెవెన్యూ నోటీసుల్లోనూ 227 పోరంబోకు 353.35 ఎకరాలుగా పేర్కొన్న ఎమ్మార్వో..
- వేలకోట్లు విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలకు ఆకుల సతీష్ డిమాండ్..
- హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ధరణీ రిజిస్ట్రేషన్‌లపై చర్యలకు ఫిర్యాదు..



# సర్వే నెం.227 సర్కారీ జమీన్‌పై.. ప్రజావాణిలో ఫిర్యాదు..

## రూ.2 వేలకోట్లు విలువైన..353.35 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించండి..

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..

## సాయినాథ్ సొసైటీకి ఎన్‌ఓసి నిరాకరణ..

బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 లోని సాయినాథ్ సొసైటీ 103-83 సెంట్‌లకు ఎన్‌ఓసి కోసం అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి, సీసీఎల్‌ఏ హైదరాబాద్ వారికి ప్రతిపాదనలు పంపించారు.. ఫైల్ నెంబర్: E5/5365/01 DATED 01-11-2004లో.. 2009 సెప్టెంబర్ 9న సంబంధిత, సీసీఎల్‌ఏ ఫైల్ నెంబర్ E5/5365/01 DATED: 09-09-2009 227/1 103- 00 ఎకరాలు గవర్నమెంట్ ల్యాండ్‌గా నిర్ధారించి ఎన్‌ఓసి ఇవ్వడానికి నిరాకరించారని ఆకుల సతీష్ ఫిర్యాదులో వివరించారు.. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే ధరణిలో పట్టాదార్ పాస్ పుస్తకాలు జారి చేయడం, సుప్రీం కోర్ట్‌లో కుడా కేసు పెండింగ్‌లో ఉన్నట్లు సతీష్ గుర్తు చేశారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 25:** దుండిగల్ గండిమైసమ్మ మండలం బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమి 353.35 ఎకరాలు కాపాడాలని మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో సోమవారం ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు.. ఆక్రమణలపై తక్షణమే చర్యలు చేపట్టాలని.. ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.. బహదూర్ పల్లి సర్వే నెంబర్ 227లో 353 ఎకరాల ప్రభుత్వ భూమి 2009 నుంచి ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.. దాదాపు రూ.2 వేలకోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ..! రెవెన్యూ, ఎస్ఆర్ఓ అధికారులు ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ప్రశ్నించారు.. అదేవిధంగా హైకోర్టులో సరైన కౌంటర్ దాఖలు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు..

హైకోర్టు పరిధిలో ఉన్న భూమిలో నిబంధనలకు నిరుద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం..!కోర్టు ఖర్చుల కోసం అంటూ..! ఐదు పాట్లు కోర్టు అనుమతి లేకుండా అధ్యక్షుడు బొడ్డు రవిశంకర్ రిజిస్ట్రేషన్‌లు చేయడంపై హౌసింగ్ సొసైటీపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.. సాయినాథ్ సొసైటీ స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయాలని..! సాయినాథ్ సొసైటీ ప్రభుత్వ భూముల ఆక్రమణ వెంచర్ అమ్మకాలు కోర్టు కేసులు తదితర పరిణామాలపై రెవెన్యూ అధికారులతో పూర్తిస్థాయి కమిటీ వేసి దోషులపై చర్యలు తీసుకోవాలి..




## బహుదూర్‌పల్లి 227 భూ స్వభావం ఏంటి..?

బహదురుపల్లి సేత్వార్ పహాణీ ప్రకారం సర్వే నెంబర్ 227 మొత్తం విస్తీర్ణం 353 -35 గుంటలు పోరంబోకు భూమిగానే ఉన్నది.. 1951-52 బహదురుపల్లి పహాణీ ప్రకారంగా కూడా భూస్వభావం పోరంబోకు భూమిగా నమోదైంది..(1).. సర్వే నెంబర్ 227/1 నుండి 12 వరకు, విస్తీర్ణం 200-00 ఎకరాలు పోరంబోకుగా నమోదైంది.. నంబూరి కృష్ణ మూర్తి కబ్జాలో వస్తుందని సతీష్ వివరించారు..(2).. సర్వే నెంబర్ 227 /2 లో 153-35 ఎకరాలు పోరంబోకుగానే ఉందని, కబ్జాలో మురహరి లాల్, ఇతరులు అని రికార్డులో ఉంది..(3)..1955 -58 సెసాల పహాణి బహదురుపల్లి గ్రామా పహాణీ ప్రకారం సర్వే నెంబర్ 227 /1 విస్తీర్ణం 200-00 ఎకరాలు ఖుల్లా పాలం పట్టా పడమటి బంజారాగా నమోదైంది.. కబ్జా కాలంలో నంబూరి కృష్ణ మూర్తి కబ్జాలో వస్తుందని, సర్వే నెంబర్ 227/2 లో 153-35 ఎకరాలు పోరంబోకుగా స్పష్టంగా నమోదైనట్లు సతీష్ తెలిపారు.. కబ్జాలో శ్రీరంగవరం పోచయ్య అండ్ ఇతరులు ఉన్నారు..

# మిడ్'డే'మీల్స్ ప్యాకింగ్ కేంద్రాన్ని..కలెక్టర్ తనిఖీ..

- మూడు జిల్లాల పాఠశాల విద్యార్థులకి మధ్యాహ్న భోజనం అందించే కేంద్రం..
- ఉప్పల్‌లోని మన్నా ట్రస్ట్ ద్వారా డైలీ 80 వేల మంది విద్యార్థులకు మీల్స్ ప్యాకింగ్ అందజేత..
- రుచికరమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని కలెక్టర్ సూచించారు..
- నాణ్యమైన వంట సామాగ్రిని వాడాలని, డేట్ చెక్ చేయాలని కలెక్టర్ సూచించారు..
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు..



ఉప్పల్ మిడ్ డే మీల్స్ తయారీ కేంద్రంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 25:** హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలలోని పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే మిడ్ డే మీల్స్ తయారీ కేంద్రాన్ని సోమవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆకస్మిక తనిఖీ చేశారు.. ఉప్పల్లోని మన్నా ట్రస్ట్ ద్వారా రోజు 80 వేల మంది విద్యార్థులకు మిడ్ 'డే' మీల్స్ వండి ప్యాక్ చేసి అందించే కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.. భోజనం వండే విభాగాన్ని స్టోరేజ్ రూమ్‌ను గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు.. రోజుకు ఎంత మంది విద్యార్థులకు భోజనం అందజేస్తారని ఎప్పటినుండి వంట మొదలు పెడతారని మిడ్ డే మీల్స్ కేంద్రం నిర్వాహకులు రమణారెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు.. అదే విధంగా వంట సామాగ్రిని ఎవరు సప్లై చేస్తారని, నాణ్యమైన సామాగ్రిని వాడాలని ఎక్స్పైరీ డేట్ చెక్ చేయాలని కలెక్టర్ సూచించారు.. వంట సామాగ్రిని తడి లేకుండా జాగ్రత్తగా భద్రపరచాలని కలెక్టర్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహసిల్దారు వాణి జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.








# హైదరాబాద్‌లో దారుణం.. చపాతి గొంతులో ఇరుక్కుని విద్యార్థి మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**గొంతులో బొక్కలు ఇరుక్కుని పలువురు మృతి చెందిన ఘటనలు చూశాం. కానీ చపాతి గొంతులో ఇరుక్కుని ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ విషాద ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పరిధిలోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్లో విరన్ జైన్ అనే విద్యార్థి ఆరవ తరగతి చదవుతున్నాడు. రోజు మాదిరిగా విరన్ జైన్ సోమవారం (నవంబర్ 25) స్కూల్‌కు వెళ్లాడు. లంచ్ బ్రేక్ సమయంలో ఇంటి నుండి తెచ్చుకున్న చపాతి తింటున్నాడు. ఈ క్రమంలో చపాతి విరన్ జైన్ గొంతులో ఇరుక్కుపోయింది.తోటి విద్యార్థుల సమాచారం ఇవ్వడంతో వెంటనే అప్రమత్తమైన స్కూల్ సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలోనే పరిస్థితి విషమించి విరన్ జైన్ చెందాడు. పాఠశాల సిబ్బంది విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న విరన్ జైన్ ఫ్యామిలీ మెంబర్స్.. ఉదయం నవ్వుకుంటూ స్కూల్‌కు వెళ్లిన కుమారుడు మధ్యాహ్నానికి విగతజీవిగా మారడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఇది మంచి ప్రభుత్వం:బీరు సేల్స్ తగ్గాయని..బీరు ధరలు పెంచటం లేదు




**హైదరాబాద్ పెన్ పవర్:**అక్కడి ప్రభుత్వం రోటీన్ కు భిన్నంగా నిర్ణయం తీసుకుంది.. సాధారణంగా ఏ ప్రభుత్వమైనా మద్యం అమ్మకాలపైనే ఎక్కువగా ఆదాయం పొందుతుందని మనందరికి తెలుసు. అప్పుడప్పుడు మద్యం ధరలు పెంచుతూ ఉంటాయి ప్రభుత్వాలు..అయితే ఈ ప్రభుత్వం మాత్రం బీర్ ప్రియులకు షాకివ్వకుండా.. గుడ్ న్యూస్ చెప్పింది.. ఇంతకీ ఏ రాష్ట్ర ప్రభుత్వం ఈ బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఆ కథాకమామిషు ఏంటో తెలుసుకుందాం రండి..

కర్ణాటక ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని మద్యం ప్రియులకు గుడ్ న్యూస్ చెప్పింది.. బీర్ ధరలు అస్సలు పెంచమని చెప్పింది. దీంతో ట్యాక్స్ పేయర్స్ అదేనండి.. మన మద్యం ప్రియులు పండగ చేసుకుంటున్నారు. ఇంతకీ ఎందుకు కర్ణాటక ప్రభుత్వం బీర్ ధరలు పెంచడం లేదు అంటే..వింటర్ సీజన్ లో బీర్ల అమ్మకాలు బాగా పడిపోయాయట.. మరి అమ్మకాలు పెరగాలంటే ఏదో చేయాలని ఆలోచించి.. బీర్ ప్రియులను ఆకట్టుకునేందుకు ఈ బంపర్ ఆఫర్ ఇచ్చింది.

కర్ణాటకలో బీర్ల అమ్మకాలు దారుణంగా పడిపోయాయట.. సాధారణంగా వింటర్ సీజన్ లో 10 శాతం అమ్మకాలు పడిపోతాయి.. కానీ ఈ వింటర్ సీజన్ లో 20 శాతం కంటే ఎక్కువగా సేల్స్ తగ్గాయట. వాతావరణం ఎక్కువగా కోల్డ్ గా ఉండటంతో సాధారణం కంటే ఎక్కువగా బీర్ల వినియోగం తగ్గిందట. ఇక ఎండాకాలం వస్తే మాత్రం బీర్ల అమ్మకాలు జోరుగా ఉంటాయి.. దీనిని దృష్టిలో పెట్టుకొని కర్ణాటక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ యేడాది 36వేల కోట్ల మద్యం అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ డిపార్టుమెంట్ కు టార్గెట్ పెట్టింది కర్ణాటక ప్రభుత్వం. అయితే ఇప్పటివరకు సగం టార్గెట్ కూడా పూర్తి కాలేదట... దీంతో టెన్షన్ లో పడ్డ ప్రభుత్వం అప్రమత్తమై ఈ నిర్ణయం తీసుకుంది. బీర్ల ధరలు పెంచకుండా ఉండే తాగేవారు పెరిగే అవకాశం ఉంటుందని ఆశిస్తోంది.. ఇది ఓవరాల్ ఎక్సైజ్ ఇన్ కంపై ప్రభావం చూపినా ఎండాకాలంలో రాబట్టుకోవచ్చులే అనుకుంటున్నారట.

# హైదరాబాద్ లో లా విద్యార్థిని అనుమానస్పద మృతి...



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని మలక్ పేటలో లా విద్యార్థిని అనుమాస్పదంగా మృతి చెందింది. మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసారం బాగ్ లో ఓ కన్సల్టెన్సీ ఆఫీస్ లో పనిచేస్తున్న లా విద్యార్థిని 20ఏళ్ళ ఇస్లావత్ శ్రావ్య అనుమాన స్పద స్థితిలో ఆఫీస్ లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శ్రావ్య మృతిపై ఆమె కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.హత్య చేసి ఆత్మహత్య గా చిత్రీకరించారంటూ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు గిరిజన సంఘాలు, యువతి తల్లిదండ్రులు. ఈ ఘటనకు సంబందించిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కడ్తల్ పక్కన ఓ తాండకు చెందిన ఇస్లావత్ శ్రావ్య ఎల్బీనగర్ లోని మహాత్మా గాంధీ లా కాలేజీలో లా థర్డ్ ఇయర్ చదువుతూ.. ఓ సీనియర్ అడ్వొకేట్ దగ్గర జూనియర్ గా ఉంటూ మలక్ పేట మూసారం బాగ్ లోని ఓ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలో పార్ట్ టైమ్ జాబ్ చేస్తోంది.ఆదివారం ( నవంబర్ 24, 2024 ) కన్సల్టెన్సీ యజమాని నవీన్ కార్యాలయంలో శ్రావ్య ఫాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది.అయితే శ్రావ్య ది ఆత్మహత్య కాదని.. లైంగిక వేధింపులు చేసి, హత్య చేశారని గిరిజన సంఘాలు మలక్ పేటలో మెట్రో స్టేషన్ వద్ద రాస్తారోకో కు దిగారు. శ్రావ్య మృతి కి కారకులైన నవీన్ ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి గిరిజన సంఘాలు. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే సమాచారం తెలిసిన పోలీసులు హుటాహుటిన మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపిస్తున్నారు యువతి కుటుంబసభ్యులు, గిరిజన సంఘాలు. మలక్ పేట మెట్రో స్టేషన్ దగ్గర గిరిజన సంఘాలు రాస్తారోకో చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది

## సంగారెడ్డి కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం.. కంప్యూటర్, ఫైళ్లు దగ్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి కలెక్టరేట్‌లో 2024, నవంబర్ 25న అగ్ని ప్రమాదం జరిగింది. కలెక్టరేట్ మొదటి అంతస్తులోని సీపీఓ కార్యాలయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో సీపీఓ కార్యాలయంలోని ఏసీ, కంప్యూటర్, కొన్ని ఫైళ్లు దగ్ధం అయినట్లు తెలుస్తోంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్లు అనుమానిస్తున్నారు. సీపీఓ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తలుపులు మూసేసి రాత్రంతా దందా.. పాతబస్తీలో పోలీసుల ఆకస్మిక దాడులు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ ఓల్డ్ సిటీలో పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. పాతబస్తీలోనీ పలు హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. పాతబస్తీ పరిధిలో అర్ధరాత్రి కూడా హోటల్స్‌లో నడిపిస్తున్నట్లు సమాచారం అందటంతో బార్కాస్ నుంచి పహాడిషరీఫ్ వరకు పోలీసుల ఆకస్మిక సోదాలు చేశారు. పలు హోటల్స్ నిర్వాహకులు తలుపులు మూసేసి నిబంధనలకు విరుద్ధంగా రాత్రంతా హోటల్స్ నడిపిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అర్ధరాత్రి కూడా హోటల్స్‌లో ఫుడ్ సరఫరా చేస్తుండటంతో పోలీసుల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో హోటల్స్ నిర్వాహకులతో పాటు కస్టమర్లకు పోలీసుల కౌన్సిలింగ్ ఇచ్చారు. రాత్రి పూట హోటల్స్ నడిపిస్తే సీరియస్ యాక్షన్ తీసుకుంటామని హోటల్ నిర్వాహకులు పోలీసులు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఫుడ్ కల్తీ ఘటనలు, నిబంధనలు విరుద్ధంగా హోటల్స్, రెస్టారెంట్లు నడుపుతోన్న వారిపై పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే డైలీ హైదరాబాద్ లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## బ్యాడ్ లక్: IPL మెగా వేలంలో అమ్ముడుపోని తెలంగాణ కుర్రాడు




**హైదరాబాద్ పెన్ పవర్:**క్యాష్ రిచ్ లీగ్ ఐపీఎల్ 2025 మెగా వేలంలో తెలంగాణ కుర్రాడు అరవెల్లి అవనీష్ తీవ్ర నిరాశ ఎదురైంది. ఐపీఎల్ వచ్చే సీజన్లో ఆడేందుకు రూ.30 లక్షల కనీస ధరతో మెగా వేలంలో పాల్గొన్న అరవెల్లి అవనీష్‌ను ఏ ఫ్రాంచైజ్ కొనుగోలు చేయలేదు. అవనీష్ కొనేందుకు ఏ ఫ్రాంఛైజ్ ఇంట్రెస్ట్ చూపించకపోవడంతో తెలంగాణ కుర్రాడు మెగా వేలంలో అన్ సోల్డ్ ప్లేయర్‌గా నిలిచాడు. దీంతో ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఐపీఎల్‌లో ఆడాలన్న అరవెల్లి అవనీష్‌కల నేరవేరలేదు. కాగా, యువ క్రికెటర్ అరవెల్లి అవనీష్ రావు స్వస్థలం తెలంగాణలో రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామం. చిన్నతనం నుండి క్రికెట్‌పై మక్కువ పెంచుకున్న అవనీష్ అంచెలు అంచెలు ఎదిగి భారత అండర్ 19 వరల్డ్ కప్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. జాతీయ జట్టుకు ఎంపిక కావడంతో అవనీష్ రావు పేరు ఒక్కసారిగా మోర్మోగిపోయింది. అండర్ 19 టీమ్‌లో చోటు దక్కించుకున్న తెలంగాణ కుర్రాడు ఐపీఎల్‌లోనూ సత్తా చాటాలనుకున్నాడు. ఈ క్రమంలోనే ఐపీఎల్ 2025 మెగా వేలంలో పేరు నమోదు చేసుకోగా.. ఫ్రాంఛైజ్‌లు మాత్రం అవనీష్‌ను కొనుగోలు చేయకపోవడంతో అన్ సోల్డ్ ప్లేయర్‌గా నిలిచిపోయాడు. ఇదే మెగా వేలంలో ఆంధ్రకు చెందిన మరో తెలుగు యువ క్రికెటర్‌ను అదృష్టం వరించింది. తెలుగు ప్లేయర్ షేక్ రషీద్‌ను చెన్నై సూపర్ కింగ్స్ కొనుగోలు చేసింది. రూ.30 లక్షల బేస్ ప్రైజ్ తో వేలంలోకి వచ్చిన షేక్ రషీద్‌ను సీఎస్కే కనీస ధరకే దక్కించుకుంది.

## సారీ డాడ్ నేను వెళ్లిపోతున్నానని ఫోన్.. తార్నాకలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యం




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో ఇంటర్ విద్యార్థిని అదృశ్యం కలకలం రేపుతోంది. తార్నాకలోని డేవిడ్ కాలేజీలో చదువుతున్న శ్రీవైష్ణవి సోమవారం (నవంబర్ 25) కనిపించకుండా పోయింది. కాలేజీ టైమింగ్ లోనే బయటికి వెళ్లిన శ్రీ వైష్ణవి అప్పటినుంచి కనిపించడం లేదు. తండ్రికి ఫోన్ చేసి..“ సారీ డాడ్ నేను వెళ్లిపోతున్నాను” అని చెప్పడంతో ఆ పేరెంట్స్ ఆందోళనతో బోరున విలపించాడు. కళాశాల యాజమాన్యం వేధింపులే తన బిడ్డ అదృశ్యానికి కారణమని అంటున్నారు. శ్రీవైష్ణవి తార్నాకలోని డేవిడ్ మెమోరియల్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం కాలేజీ టైమ్ మధ్యలోనే బయటికి వెళ్లిపోయింది. తండ్రికి ఫోన్ చేసిన తన బాధను చెప్పుకుంటూ..సారీ డాడ్ నేను వెళ్లిపోతున్నాను చెప్పింది.. ఆందోళనకు గురైన శ్రీవైష్ణవి పేరెంట్స్ కళాశాల వద్దకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు.. తన బిడ్డ అదృశ్యమవడానికి కారణం కాలేజీ యాజమాన్యమే అని ఆరోపిస్తున్నారు.

# కేబినెట్ విస్తరణ కోసం కాదు.. ఢిల్లీ పర్యటనపై కుండబద్దలు కొట్టిన రేవంత్




**హైదరాబాద్ పెన్ పవర్:** తన ఢిల్లీ పర్యటనలపై ప్రతిపక్షాలు చేస్తోన్న విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సోమవారం (నవంబర్ 25) వెళ్తోన్న ఢిల్లీ టూర్ మంత్రివర్గ విస్తరణ కోసమో, రాజకీయాల కోసమో కాదని.. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కూతురు విహహం కోసమే ఢిల్లీ వెళ్తున్నానని క్లారిటీ ఇచ్చారు. ఈ ఢిల్లీ పర్యటనకు రాజకీయాలకు సంబంధం లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో 2024, నవంబర్ 25న సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ఢిల్లీ పర్యటనలపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు.. వాళ్లలా ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకోవడానికో.. కేసుల మాఫీ, బెయిల్, పైరవీల కోసమో మేం ఢిల్లీకి వెళ్లట్లేదని.. కేంద్రం నుండి రావాల్సిన నిధులపై చర్చించేందుకు వెళ్తున్నామని కౌంటర్ ఇచ్చారు. 28 సార్లు ఢిల్లీకి వెళ్లారని విమర్శిస్తున్నారు.. కానీ కేంద్ర ప్రభుత్వం నుండి తెలంగాణకు రావాల్సిన నిధులకు కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళ్తా.. నిధులు సాధించుకుంటానని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశామని.. లోక్ సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేస్తామని తెలిపారు.ఎయిర్ పోర్టు, మెట్రో రైలు అంశాలతో పాటు కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్న నిధులపై చర్చిస్తామన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, అనుమతులపై తాను అందుబాటులో ఉన్న కేంద్రమంత్రులను కలుస్తానని చెప్పారు. కేంద్రంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అంటకాగి బయ్యారం, కాజీపేట ఫ్యాక్టరీలు రాకుండా చేసిందని ఫైర్ అయ్యారు. మేం మాత్రం రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటి కోసం కేంద్రంతో కొట్లాడి సాధించుకుంటామని.. మీ కడుపు మంట.. మీ దు:ఖాన్ని మేం పట్టించుకోమని అన్నారు.

# కాస్త చలికే వణికిపోతున్నాం.. మరి ఇక్కడికి వెళితే?

**భూమ్మీద అత్యంత శీతల ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి**

**అందులో మనుషులు నివసించే ప్రదేశాలూ ఎన్నో**

**అక్కడ ఏడాది పొడవునా పూర్తిగా మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలే!**



**హైదరాబాద్ పెన్ పవర్:**మనకు ఉష్ణోగ్రతలు పది, పదిహేను డిగ్రీల సెంటీగ్రేడ్ లకు తగ్గితేనే గజగజా వణికిపోతున్నాం. ఉదయం, సాయంత్రం స్వెట్టర్లు లేనిదే బయటికి రాలేకపోతున్నాం. కానీ భూమ్మీద కొన్నిచోట్ల అత్యంత శీతల పరిస్థితులు ఉంటాయి. అక్కడ ఎప్పుడూ మైనస్ డిగ్రీలలోనే ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మనం నోట్లోంచి ఆవిరి వదిలితే.. అది అక్కడిక్కడే మంచుగా మారిపోయి కిందపడేంత చల్లగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతాల్లో కొన్నిచోట్ల మనుషులు కూడా నివసిస్తుంటారు. మరి భూమ్మీద అత్యంత చల్లటి ప్రాంతాలేవో తెలుసుకుందామా…

### డోమ్ ఫుజి, అంటార్కిటికా

భూమ్మీద ఇప్పటివరకు నమోదైన అత్యంత తక్కువ ఉష్ణోగ్రత ఇక్కడిదే. అంటార్కిటికాలోని డోమ్ ఫుజి ప్రాంతంలో 2010లో అత్యల్పంగా మైనస్ 93.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

### వోస్తోక్ స్టేషన్, అంటార్కిటికా

అంటార్కిటికా ఖండంలోనిఈ పరిశోధన కేంద్రం పరిసరాలలో.. 1983 జూలై 21న మై నస్ (–)89.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏ డాది పొడవునా పరిశోధనలు జరిగే ప్రదేశం ఇది.

### ఓయ్మ్యకోన్, సైబీరియా, రష్యా

సాధారణ ప్రజలు నివసించే ప్రాంతాల్లో అత్యంత చల్లగా ఉండేది ఇదే. సమీపంలోని ఖనిజ నిక్షేపాల తవ్వకాల కోసం ఇక్కడ ఓ చిన్న పట్టణం ఉంది. ఇక్కడ ఉష్ణోగ్రతలు తరచూ మైనస్ 67 డిగ్రీల వరకు పడిపోతుంటాయి.

### వెరోయానస్క్, సైబీరియా రష్యా

ఇది కూడా ప్రజలు నివసించే ప్రాంతమే. ఇక్కడ చలికాలంలో ఉష్ణోగ్రతలు మైనస్ 50 డిగ్రీలకన్నా తగ్గిపోతూ ఉంటాయి.

### నార్త్ ఐస్, గ్రీన్ లాండ్

కెనడాకు దగ్గరగా ఉండే గ్రీన్ ల్యాండ్ ఏడాది పొడవునా మంచుతోనే కప్పబడి ఉంటుంది. ఇక్కడ కూడా అంటార్కిటికా తరహాలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఇక్కడ మనుషుల శాశ్వత నివాసాలు లేవు.

### స్నాగ్, యుకోన్, కెనడా

ఉత్తర అమెరికాలో అత్యంత శీతల పరిస్థితులు ఉండే ప్రాంతం స్నాగ్. ఇక్కడ ఇప్పటివరకు మైనస్ 63 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. తరచూ ఉష్ణోగ్రతలు మైనస్ 50 డిగ్రీల వరకు ఉంటుంటాయి.

### ఉలాంబటార్, మంగోలియా

ప్రపంచంలో అత్యల్ప ఉ ష్ణోగ్రతలు ఉండే ఒక రాజధాని ప్రాంతం ఉలాంబటార్. ఇక్కడ ఏటా శీతాకాలంలో ఉష్ణోగ్రతలు మైనస్ 30, 40 డిగ్రీల స్థాయికి పడిపోతుంటాయి.

### ప్రాస్పెక్ట్ క్రీక్, అలాస్కా, యూఎస్ఏ

యూఎస్ఏలో అత్యంత శీతల ప్రదేశం ఇది. ట్రాన్స్ అలాస్కా పైప్ లైన్ పనులు చేయడం, నిర్వహణ కోసం గతంలో ఇక్కడ కార్మికులు, అధికారుల షెల్టర్లు ఉండేవి. కానీ అక్కడి దుర్భల వాతావరణం కారణంగా ఇప్పుడు మనుషులెవరూ ఉండటం లేదు.

# సినిమాకు మించి! పెళ్లి కోసం ఊరేగింపుగా గుర్రంపై వెళ్తున్న పెళ్లి కొడుకు.. మెడలోని నోట్ల దండను కాజేసి ట్రక్ డ్రైవర్ పరార్.. తర్వాత ఊహించని ఘటన..

- గుర్రం దిగి బైక్‌పై ట్రక్‌ను వెంబడించిన పెళ్లి కొడుకు
- నడుస్తున్న ట్రక్‌పైకి ఎగబాకి ఆపై లోపలికి దూరి డ్రైవర్‌ను పట్టుకున్న వరుడు
- అందరూ కలిసి డ్రైవర్‌ను చితకబాదిన వైనం
- ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఘటన



**హైదరాబాద్ పెన్ పవర్:**మరికాసేపట్లో పెళ్లి జరగాల్సి ఉంది. పెళ్లి కొడుకు ఉత్సాహంగా గుర్రమెక్కి ఊరేగింపుగా వివాహ వేదిక వద్దకు బయలుదేరాడు. స్నేహితులు, బంధువులతో కలిసి వెళ్తున్న అతడి మెడలోని కరెన్సీ దండను అటుగా మినీ ట్రక్‌లో వెళ్తున్న డ్రైవర్ కాజేశాడు. వెంటనే అప్రమత్తమైన వరుడు పెళ్లి మండపానికి వెళ్లడానికి బదులు నగదు దండను చోరీ చేసిన డ్రైవర్‌ను పట్టుకునేందుకు బయలుదేరాడు.

పెళ్లిని పక్కన పెట్టి గుర్రం దిగి పక్కనే ఉన్న వ్యక్తి బైక్ తీసుకుని హైవేపై ట్రక్‌ను వెంబడించాడు. ట్రక్ చేతికి అందాక బైక్‌ను వదిలి సినిమాల్లో చూపించినట్టుగా ట్రక్ పైకి ఎగబాకాడు. జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకుంటూ ఆపై విండో లోంచి లోపలికి ప్రవేశించాడు. అనంతరం డబ్బుల దండను పట్టుకుని వాహనం దిగిన పెళ్లి కొడుకు డ్రైవర్‌ను కిందికి దింపి చితకబాదాడు. ఈ క్రమంలో అతడిని వెంబడిస్తూ వచ్చిన పెళ్లి కొడుకు స్నేహితులు కూడా తలా ఓ చేయి వేశారు. అంతేకాదు, దారిన పోయే వారు కూడా డ్రైవర్‌పై ప్రతాపం చూపారు. వారి దెబ్బలకు తాళలేక తనను వదిలిపెట్టాలని డ్రైవర్ వేడుకున్నాడు. డబ్బుల దండను దొంగిలించాలన్నది తన ఉద్దేశం కాదని, పొరపాటున అలా జరిగిపోయిందని చెప్పుకొచ్చాడు. అయినప్పటికీ వారి చేతిలో అతడికి చావు దెబ్బలు తప్పలేదు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. పెళ్లి కొడుకు చేజ్ చేసిన తీరు, అతడి ధైర్యానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.

# పార్లమెంట్ సమావేశాలకు ముందు ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు.. కాంగ్రెస్‌పై ముప్పేట దాడి

- ప్రజలు పదేపదే తిరస్కరిస్తున్న వ్యక్తులు పార్లమెంట్, రాజ్యాంగాలను అవమానిస్తున్నారన్న మోదీ
- గూండాయిజం ద్వారా సభలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు
- మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి ఓటమిని ఉద్దేశించి మోదీ విమర్శలు
- పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన మోదీ



**హైదరాబాద్ పెన్ పవర్:** (సోమవారం) నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. సమావేశాల ప్రారంభానికి ముందు విపక్ష కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముప్పేట దాడి చేశారు. ప్రజలు పదే పదే తిరస్కరించినవారు పార్లమెంటును, ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నారంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కొందరు వ్యక్తులు చేతికింద మనుషులను పెట్టుకొని గూండాయిజం ద్వారా పార్లమెంటును నియంత్రించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారి చర్యలన్నింటినీ దేశ ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు వారిని మళ్లీ శిక్షిస్తారని అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరగాలని ఆశిస్తున్నానని ఆయన అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించిన రెండు రోజుల తర్వాత ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు."ప్రజలు దాదాపు 80-90 సార్లు తిరస్కరించివారు పార్లమెంటులో చర్చలు జరగనివ్వడం లేదు. మన రాజ్యాంగంలో పార్లమెంటు, మన ఎంపీలు ఎంతో ముఖ్యం. పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎక్కువ మంది ఎంపీలు చర్చలకు సహకారం అందించాలి. పలు విశేషాలతో ఈ పార్లమెంట్ సమావేశాలు చాలా ప్రత్యేకమైనవి. రాజ్యాంగం ఆమోదించి 75 సంవత్సరం ప్రారంభమవనుండడం అందులో ఒకటి" అని ప్రధాని మోదీ గుర్తుచేశారు. కాగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్లును ప్రవేశపెట్టవచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇక ఈ సెషన్‌లో వక్ఫ్ సవరణ బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లులు చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, రైల్వే చట్టం సవరణ బిల్లులు లోక్‌సభలో ప్రవేశపెట్టే సూచనలు ఉన్నాయి.

## చారిత్రాత్మకమైన తీర్పునిచ్చిన మహారాష్ట్ర ఓటర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ ఉచితాలు, అబద్దాల ప్రచారాన్ని మహారాష్ట్ర ప్రజలు తిరస్కరించి ఖచ్చితమైన గుణపాఠం చెప్పారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి అన్నారు. మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి-ఎన్డిఏ విజయదుందుభి మోగించిన సందర్భంగా ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్ రెడ్డి మాట్లాడారు. ఆర్నెళ్ళ క్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్-యుపిఏ మిత్రపక్షాల పట్ల దేశ ప్రజలు కొంత సానుభూతుని చూపారని, కానీ, అతికొద్ది సమయంలోనే కాంగ్రెస్ పార్టీ కుటిలనీతిని అర్థం చేసుకున్న ప్రజలు ఆ పార్టీని బొందపెట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయిన నావగా అభివర్ణించిన సురేష్ రెడ్డి ఆ పార్టీని నమ్ముకున్న మిత్రపక్షాలను సైతం ముంచుతున్నదని ఎద్దేవ చేశారు. కాంగ్రెసును నమ్ముకున్న పాపానికి రాజకీయ కురువృద్ధుడు ఎన్సిపి నేత శరద్ పవార్, ఉద్ధవ్ శివసేన పార్టీ నిండా మునిగిందని తెలిపారు. కాంగ్రెసును నమ్ముకున్న ఏ పార్టీ మనుగడ సాధించిన ధాఖలాలు లేవన్నారు.

రానున్న రోజులన్నీ భారతీయ జనతా పార్టీవేనని స్పష్టం చేసిన సురేష్ రెడ్డి, తెలంగాణాలో అధికారంలో రావడం కోసం వ్యూహాత్మకంగా అడుగులువేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ అధిగమిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేద్రమోదీ పట్ల ప్రజల్లో సంపూర్ణమైన నమ్మకం ఏర్పడిందని, దానిని బాసటగా చేసుకొని తెలంగాణాలో కమలం జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**అభివృద్ధిని మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం..**

తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజలు, రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇచ్చిన హామీలను మరిచి, నిలదీసిన ప్రజలను బెదిరింపులకు గురిచేయడం, దాడులకు పాల్పడటం చేస్తున్నారని తెలిపారు. పెద్దపల్లిలో సైతం ప్రజాప్రతినిధులు అదే పంథాను కొనసాగించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు నిస్వార్థ సేవలను అందిస్తామని సురేష్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు వేల్పుల రాజన్న పటేల్,దేవిడి రజినీకర్ రెడ్డి తదితర్లులు పాల్గొన్నారు.

## హక్కుల సాధన కోసమే సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె.

**హైదరాబాద్ పెన్ పవర్:** సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల హక్కుల సాధన కోసమే సమ్మె చేయడం జరుగుతుందని బసంత్ నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి అన్నారు.

కెసోరాం సిమెంట్ కర్మాగారంలో సోమవారం కార్మికులు సమ్మె ప్రారంభించారు. కార్మిక నాయకులు పర్మనెంట్ యూనియన్ అధ్యక్షులు బయ్యపు మనోహర్ రెడ్డి ప్యానెల్

మెరుగైన బోనస్ ఇవ్వాలని గత నెల రోజులుగా పలు దఫాలుగా చర్చలు జరిపి ,పది రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టినప్పటిన తరుణం లో కంపెనీ యాజమాన్యం దిగివచ్చి హామీలు ఇస్తూ , మాట తప్పుతూ కార్మికులకు న్యాయం చేయడం లేదు ..మెరుగైన బోనస్ చెల్లించడం లేదు.కార్మికుల హక్కుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ,నాయకత్వ పోరాటాలకు సైతం పూర్తి స్థాయిలో స్పందించని తరుణం లో ఈరోజు ఉదయం 6 గంటలకు కార్మికులందరూ విధులకు గైర్హాజరయ్యారు నాయకులు బయ్యపు మనోహర్ రెడ్డి ప్యానెల్ ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు .

52000 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ తో సమ్మె కొనసాగుతోంది . ఇట్టి కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేష్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్ యాదవ్,క్లబ్ సెక్రటరీ పోతుల ప్రసాద్ ,బాడీ మెంబర్లు ,పర్మనెంట్ కార్మిక సోదరులు, కన్నాల రాణపూర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు తీర్పు పైనే ఆశలు!

**హైదరాబాద్ పెన్ పవర్:**గత పది నెలలుగా గురుకుల అభ్యర్థులు న్యాయం చేయాలని, డౌన్ మెరిట్ అవకాశం కల్పించాలని, మిగిలిపోయిన పోస్టులను బ్యాక్ లాగ్ చేయకుండా డౌన్ మెరిట్ అవకాశం కనిపించాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అయినా వారి మొర ప్రభుత్వం,అధికారులు, మంత్రులు ఎమ్మెల్యేలు పట్టించుకున్న పాపాన పోలేదు. వారు చేసేది ఏమీ లేక కోర్టు ను ఆశ్రయించారు. చివరికి కోర్టు తీర్పు కొరకు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

**నిరుద్యోగులంతా తల ఇంత డబ్బులు వేసుకొని.**

గురుకుల అభ్యర్థులు కోర్టు ద్వారా న్యాయం జరుగుతుందని, ఆశతో గురుకుల అభ్యర్థులంతా మనిషికి కొంత డబ్బులు వేసుకొని కోర్టులోకేసు వేసుకున్నారు. ముఖ్యంగా కోర్టు కేసులో డౌన్ మెరిట్,న్యాయం కోసం కొందరు నిరుద్యోగులు వారు చేసే ప్రైవేటు ఉద్యోగాలు , కుటుంబాలను సైతం వదులుకొని ప్రతిరోజు లాయర్ల చుట్టూ, కోర్టు చుట్టూ ఆశతో తిరుగుతున్నారు. ఏది ఏమైనా గురుకుల అభ్యర్థులకు కోర్టు ద్వారా లాభం జరగాలని అందరు అనుకుంటున్నారు.

**గురుకుల అభ్యర్థుల విన్నపం.**

గత ప్రభుత్వం గురుకులాల్లో 9210 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక
గురుకుల ఫలితాలు ప్రకటించి
ఆగమేఘాలమీద అధికారులు ముఖ్యమంత్రి మెప్పు పొందేందుకు కొందరికి ఉద్యోగాలు పత్రాలు అందజేసింది. ముఖ్యంగా గురుకుల ఈ ఉద్యోగాల్లో డీల్,జెల్,పీజీటీ,టీజీటీ, అభ్యర్థులకు కామన్ పేపర్ ఒకటే పెట్టడం ద్వారా ఒకే అభ్యర్థి మూడు,నాలుగు ఉద్యోగాలు సాధించారు. కానీ ఒకే అభ్యర్థి ఒకే ఉద్యోగం చేస్తాడు. ఇలా అన్ని ఉద్యోగం పొందిన అభ్యర్థి నుండి( రిలీక్విష్మెంట్ ) మిగిలిన ఉద్యోగాలు వదులుకుంటున్నానని ఉద్యోగం వచ్చిన అభ్యర్థి నుండి అవకాశం కల్పించి. మిగిలిపోయిన పోస్టులకు డౌన్ మెరిట్ అవకాశం కల్పించాలని గురుకుల అభ్యర్థుల ప్రధాన డిమాండ్ ఇంతవరకు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి రాకపోవడంతో గురుకుల అభ్యర్థులంతా చేసేది ఏమిలేక కోర్టును ఆశ్రయించారు. వారంతా కోర్టు తీర్పు కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు.

## వ్యవసాయ కూలీలకు ఇళ్ల స్థలాలు, సాగు భూముల సాధన కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కూలీలకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల ఇంటి స్థలం పట్టణ ప్రాంతాలలో రెండు స్థలం రెండు ఎకరాల ప్రభుత్వ సాగు భూమి మంజూరు చేయాలని గత కొంతకాలంగా సాగుతున్న ఆందోళనలను నుండి జిల్లా వ్యాప్త ఉద్యమంగా మలుస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. వీరశేఖర్, సి .సుబ్రహ్మణ్యంలు పేర్కొన్నారు ఆదివారం సిపిఐ కార్యాలయం కోచ్ మెన్ భవన్ లో జరిగిన జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.... గత ప్రభుత్వ హయాంలో చాలీచాలని ఒక సెంటు ఇంటి స్థలం కేటాయిస్తే మేము అధికారంలోకి వస్తే ప్రతి గ్రామంలో పేదలందరికీ మూడు సెంట్ స్థలం పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి నాలుగు లక్షల రూపాయలతో ఇల్లు కట్టిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని తక్షణమే అమలు చేయుట కోసం అన్ని సచివాలయ కేంద్రాలలో పేతుల యొక్క దరఖాస్తులను తీసుకోవాలని ఇప్పటికే సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న సచివాలయాల వద్ద ఆందోళన చేసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని దీన్ని ఈ నెల చివరి వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కొనసాగింపు చేస్తామని ఈ సందర్భంగా వ్యవసాయ కూలీలతో గ్రామ కమిటీలు మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని అదేవిధంగా సంఘ సభ్యత్వం చేర్పించవలసిందిగా వారు కోరారు కేంద్రంలో మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యవసాయ కూలీలు రైతులను పూర్తిగా విస్మరించిందని అందుకే ఈనెల 26వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆంధ్ర జరగబోతున్నాయని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా భాగస్వామ్యం కావాలని వారు కోరారు..

# పర్యాటక రంగానికి ఊపు కోసం కసరత్తు

**హైదరాబాద్ పెన్ పవర్:)**

తెలంగాణలో ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిల్లో కొన్ని మినహా.. ఇతర ప్రాంతాలు అభివృద్ధి చెందలేదు. అయితే.. హైదరాబాద్ వెలుపల ఉన్న పర్యాటక ప్రదేశాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. 10 ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేయనుంది. సరికొత్త అనుభూతిని పంచేందుకు ఏర్పాట్లు చేస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. చరిత్రకు అద్దంపట్టే ప్రదేశాలకు లెక్కలేదు. ఆహ్లాదం, ఆనందాన్ని పంచే ప్రాంతాలకు కొదవ లేదు. కానీ.. ఆ ప్రాంతాలపై దృష్టిపెట్టక అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆయా ప్రాంతాలకు పర్యాటకులు వచ్చినా.. సరైన సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రధానంగా 10 సర్యూట్లపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. హైదరాబాద్ వెలుపల ఉండే పది ప్రత్యేక ప్రాంతాల్లో ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించనుంది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా పర్యాటక పాలసీని తయారుచేస్తున్నారు. ఇది తుది మెరుగులు దిద్దుకుంటుంది. ఈ ముసాయిదాపై త్వరలోనే సమావేశం నిర్వహించి మార్పుచేర్పులు చేయనున్నారు. ఆ తర్వాత కేబినెట్‌లో చర్చించి పర్యాటక విధానాన్ని ఖరారు చేయనుంది. గుర్తించిన ప్రదేశాల్లో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూముల్లోనూ ప్రాజెక్టులు చేపట్టేలా పాలసీ ఉంటుందని తెలుస్తోంది. పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. పెట్టుబడిని బట్టి రూ. 100 కోట్ల వరకు, రూ. 100–500 కోట్లు.. ఆ పైన ప్రాజెక్టులుగా వర్గీకరిస్తున్నట్లుగా టూరిజం అధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలో పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. దీంతో ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు



రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ముఖ్యంగా క్యారవాన్ వాహనాలు, సాహస క్రీడలపై పెట్టుబడులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారంభాగ్యనగరానికి ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్ వెలుపల, మారుమూల ప్రాంతాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలని రేవంత్ సర్కారు భావిస్తోంది. పర్యాటక ప్రాజెక్టులపై పెట్టే ఖర్చు, ప్రాంతాన్ని బట్టి గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు రాయితీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలా ప్రైవేట్ పెట్టుబడులు పెరిగితే.. తెలంగాణ టూరిజం కొత్తపుంతలు తొక్కే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి కేవలం 180 కి.మీ దూరంలోని నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి ఏపీలోని శ్రీశైలం వరకు క్రూయిజ్ షిప్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఏడాది పొడవునా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్ కసరత్తు చేస్తోంది. మరో వైపు కేరళలోని అలప్పుజ, జమ్మూకశ్మీర్ శ్రీనగర్‌లోని దాల్ లేక్‌లో మాదిరి స్పీడ్ బోట్లు, హౌస్‌బోట్ల సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సైతం ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం కృష్ణానదిలో సమృద్ధిగా నీరు ఉండటంతో సోమశిల నుంచి శ్రీశైలం వరకు.. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు క్రూయిజ్ షిప్ టూర్‌ని రెండ్రోజుల క్రితం ప్రారంభించారు. సోమశిల– శ్రీశైలం 120 కి.మీ. దూరం కాగా 6.30 గంటల్లో నది అందాలను చూస్తూ జర్నీ చేయవచ్చు.ఈ లాంచీ ప్రయాణంలో అబ్బురపరిచే దృశ్యాలెన్నో పర్యాటకులను కనువిందు చేస్తాయి. నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీప్రాంత అందాలను వీక్షించొచ్చు. నదికి ఓ వైపు తెలంగాణలో అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం ఉండగా.. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఉంది. ఈ అడవుల్లో ఉండే పెద్దపులులు ఈదుతూ కృష్ణా నదిని దాటతాయి. నీటి మట్టం అధికంగా ఉన్నప్పుడు తప్పితే మిగతా సమయాల్లో పెద్దపులులు నది మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.త్వరలో హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో సోమశిల, నాగార్జునసాగర్ టూర్లను అధికారులు ఫ్లా?న్ చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీశైలం నుంచి తీసుకురావడంతో పాటు అక్కడ బోర్డింగ్ వంటి సౌకర్యాల్ని కల్పించనున్నారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు నలుగురు ప్రయాణించేలా స్పీడ్ బోట్ల కొనుగోలుకు టూరిజం డిపార్ట్‌మెంట్ రెడీ అవుతోంది. 20 సీట్లతో డీలక్స్ బోట్‌ను కొనుగోలు చేయనుంది. ఇవి అందుబాటులోకి వస్తే. బోటు ప్రయాణాన్ని పర్యాటకురాలు ఆస్వాదించొచ్చు.ఇక నవంబర్ 2న ప్రారంభమైన క్రూయిజ్ షిప్‌ల ప్రత్యేక ప్యాకేజీ విషయానికొస్తే.. సింగిల్ వే పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా నిర్ణయించారు. రౌండప్ టూర్ ప్యాకేజీ అయితే.. పెద్దలకు రూ. 3000, పిల్లలకు రూ. 2,400గా డిసైడ్ చేశారు. సోమశిల–శ్రీశైలం, నాగార్జున సాగర్– శ్రీశైలం ఈ రెండు టూర్లకు ఇదే ప్యాకేజీ వర్తించనుంది.

# మళ్లీ పెరిగిన రియల్ వ్యాపారం

**హైదరాబాద్ పెన్ పవర్:**



హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుంది. గడచిన ఆరు నెలల్లో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్ బలమైన వృద్ధిని కనబరిచిందని స్థిరాస్తి కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. అక్టోబర్‌లో హైదరాబాద్ లో స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు 20 శాతం పెరిగాయని, రియల్ ఎస్టేట్ మార్కెట్ కార్యకలాపాలలో చెప్పుకోదగ్గ పెరుగుదలను కనిపించిందని ఈ సంస్థ సర్వే రిపోర్టు తెలిపింది. అక్టోబర్ నెలలో మొత్తం 5,985 రెసిడెన్షియల్ యూనిట్లు విక్రయించారు. రూ. 3,617 కోట్ల గృహాల అమ్మకాలు జరిగాయని సర్వే తెలిపింది. హైదరాబాద్ నగరంలో నివాస ప్రాపర్టీ లావాదేవీలలో ఏడాదికి 14 శాతం పెరుగుదల నమోదు అవుతున్నట్లు నైట్ ఫ్రాంక్ సంస్థ తెలిపింది.ఆగస్టు, సెప్టెంబరులో రియల్ ఎస్టేట్ అమ్మకాలు క్షీణించాయని, అయితే అక్టోబర్ బలమైన రికవరీ సాధించినట్లు నైట్ ఫ్రాంక్ సంస్థ తెలిపింది. ఆగస్టులో 27 శాతం, సెప్టెంబరులో 24 శాతం రియల్ ఎస్టేట్ విక్రయాలు క్షీణించాయి. అక్టోబర్‌లో 20 శాతం స్థిరాస్తి మార్కెట్ పుంజుకున్నట్లు సర్వేలో స్పష్టమైంది.అక్టోబర్ నెలలో రంగారెడ్డి 43 శాతం, మేడ్చల్–మల్కాజిగిరి 41 శాతం, హైదరాబాద్ 16 శాతం ఆస్తి రిజిస్ట్రేషన్లు జరిగాయని నైట్ ఫ్రాంక్ సంస్థ తెలిపింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఇండ్ల విక్రయాలు బలంగా ఉన్నాయి. 59 శాతం గృహాలు రూ. 50 లక్షల కంటే తక్కువ ధరకు విక్రయించారు. అలాగే ప్రీమియం ఇళ్ల కొనుగోలుపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది. అలాగే రూ. 1 కోటి కంటే ఎక్కువ ధర ఉన్న ఆస్తుల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే 36 శాతం పెరిగాయి. దీంతో పాటు పెద్ద ఇళ్లకు అంటే 2 వేల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఇండ్లకు డిమాండ్ పెరిగిందని ఈ సంస్థ తెలిపింది. వీటి రిజిస్ట్రేషన్లలో 12 శాతం పెరిగిందని పేర్కొంది. ఇది గత సంవత్సరంలో 11 శాతంగా ఉందని వెల్లడించింది.

హైదరాబాద్‌లో రెసిడెన్సియల్ ప్రాపర్టీల సగటు ధర కూడా అక్టోబర్‌లో 7 శాతం పెరిగింది. సంగారెడ్డిలో 13 శాతం పెరుగుదలలో నమోదైంది. ఆగస్టు నెలలో హైదరాబాద్ లో 6439 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటి విలువ రూ.4043 కోట్లు. గతేడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్లు 17 శాతం పెరిగాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 8 నెలల్లో 54,483 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని నైట్ ఫ్రాంక్ నివేదిక పేర్కొంది. తాజా లెక్కలతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ జోరు తగ్గలేదని అర్థమవుతోంది.గడచిన ఆరు నెలల్లో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ నగర స్థిరాస్తి మార్కెట్ బలమైన వృద్ధిని కనబరిచిందని ప్రముఖ స్థిరాస్తి కన్సల్టెన్సీ అన్ రాక్ ప్రకటించింది. 2023 – 2024 ప్రథమార్థంతో పోల్చితే 2024 – 25 మొదటి ఆరు నెలల్లో ఇళ్ల ధరలు 37 శాతం పెరిగాయని అన్ రాక్ విశ్లేషించింది.